10 YEAR ANNIVERSARY 2014 - 2024

# పెన్ పవర్

తెలంగాణ రౌండప్

ఆదివారం 22 డిసెంబర్ 2024 పేజీలు 8

## పుష్ప-2 సినిమాతో ఆఖరు...
# అవన్నీ ఆపేస్తున్నాం



- కిమ్స్ ఆసుపత్రికి వెళ్లిన మంత్రి కోమటిరెడ్డి
- చికిత్స పొందుతున్న బాలుడు శ్రీతేజ్ కు పరామర్శ
- అనంతరం మీడియాతో మాట్లాడిన మంత్రి
- ఇకపై తెలంగాణలో బెనిఫిట్ షోలకు అనుమతి ఇవ్వబోమని వెల్లడి

-2లో



- శీతాకాలం విడిదికై గత మంగళవారం హైదరాబాద్‌కి విచ్చేసిన భారత రాష్ట్రపతి..
- ఐదు రోజుల పర్యటన విజయవంతంగా ముగించుకుని డిల్లీ పయనం..
- తెలంగాణరాష్ట్ర గవర్నర్ జిష్ణుదేవ్ వర్మ, కేంద్ర గనుల శాఖ మంత్రి కిషన్ రెడ్డి రాష్ట్రపతికి వీడ్కోలు..
- తెలంగాణ మహిళా శిశు సంక్షేమ శాఖ మంత్రి సీతక్క కలెక్టర్ గౌతమ్ వీడ్కోలు పలికారు..
- రాష్ట్రపతి పర్యటన విజయవంతంలో అధికారులను అభినందించిన కలెక్టర్ గౌతమ్..

-2లో



# భారత రాష్ట్రపతి ఐదు రోజుల...
# పర్యటన విజయవంతం



శనివారం హకీంపేట్ విమానాశ్రయం నుండి డిల్లీకి బయలుదేరిన రాష్ట్రపతి ద్రౌపది ముర్ము..

## నా తండ్రి పేరు చెప్పుకుని ఇక్కడి వరకు రాలేదు

### నిప్పులు చెరిగిన రేవంత్ రెడ్డి



- రియల్ ఎస్టేట్ వ్యాపారులకు, పారిశ్రామికవేత్తలకు కూడా రైతుబంధు ఇచ్చారని రేవంత్ మండిపాటు
- అబద్ధాలకు అధ్యక్షుడు కేసీఆర్ సభకు రావడం లేదని విమర్శ
- ఆర్థిక ఉగ్రవాదులను వదిలేద్దామా? అని ప్రశ్న

-4లో

## అసెంబ్లీలో సీఎం రేవంత్ అబద్ధాలు చెప్పారు



హైదరాబాద్ పెన్ పవర్:సీఎం రేవంత్ రెడ్డి అసెంబ్లీలో అబద్ధాలు చెప్పారని బీఆర్ఎస్ నేత, మాజీ మంత్రి కేటీఆర్ అన్నారు. సీఎం రేవంత్ తన అసమర్ధతను ఒప్పుకున్నారని, పాలన చేతకావడం లేదని అంగీకరించారని విమర్శించారు. అసెంబ్లీలో బీఆర్ఎస్ పై సీఎం రేవంత్ రెడ్డి తీవ్ర విమర్శల అనంతరం ప్రెస్ మీట్ పెట్టిన కేటీఆర్.. రైతు భరోసా అమలుపై ప్రభుత్వానికి చిత్తశుద్ధి లేదని అన్నారు. రుణమాఫీపై నేతలు తలో మాట చపుతున్నారని విమర్శించారు. సీఎం చెప్పే కాకి లెక్కలు తాము నమ్మడం లేదని అన్నారు. ఆరు గ్యారంటీలపై కాంగ్రెస్ నేతలను ప్రజలు ప్రశ్నించాలని పిలుపునిచ్చారు.రైతుభరోసాపై షరతులు పెడతామని

-2లో

# భారత రాష్ట్రపతి ఐదు రోజుల.. పర్యటన విజయవంతం..





**మేడ్చల్ జిల్లా బ్యూరో, పెన్ పవర్, డిసెంబర్ 21:** భారత రాష్ట్రపతి ద్రౌపది ముర్ము శీతాకాల విడిదికై మంగళవారం హైదరాబాదుకు విచ్చేసిన సందర్భంగా, రాష్ట్రపతి పర్యటన విజయవంతంగా ముగించుకొని శనివారం హకీంపేట విమానాశ్రయం నుండి ఢిల్లీకి బయల్దేరారు.. తెలంగాణరాష్ట్ర గవర్నర్ జిష్ణుదేవ్ వర్మ, భారత గనుల మంత్రిత్వ శాఖ కిషన్ రెడ్డి, మహిళా శిశు సంక్షేమ శాఖ మంత్రి సీతక్క, ప్రభుత్వ ప్రత్యేక సలహాదారు వేణుగోపాల్ రావు, ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శాంతకమారి, మేడ్చల్ మల్కాజగిరి జిల్లా కలెక్టర్ గౌతమ్, రాష్ట్రపతి ద్రౌపది ముర్ము కు ఘనంగా వీడ్కోలు పలికారు.. అనంతరం రాష్ట్రపతి పర్యటన విజయవంతంలో అధికారుల పాత్ర అభినందనీయమని అధికారులను అభినందించిన మేడ్చల్ మల్కాజిగిరి జిల్లా కలెక్టర్ గౌతమ్..

భారత రాష్ట్రపతి ద్రౌపది ముర్ము పర్యటన విజయవంతం చేయడంలో జిల్లా స్థాయిలోని అన్ని శాఖల అధికారుల పాత్ర ఎంతో అభినందనీయమని వారు ఎంతో బాధ్యతాయుతంగా వారి విధులు నిర్వహించారని మేడ్చల్ %-% మల్కాజిగిరి జిల్లా కలెక్టర్ గౌతంఅన్నారు. రాష్ట్రపతి ద్రౌపది ముర్ము శీతాకాల విడిది శనివారంతో ముగియడంతో ఆమె ఢిల్లీకి బయల్దేరిన అనంతరం కలెక్టర్ గౌతం మాట్లాడుతూ భారత రాష్ట్రపతి ద్రౌపది ముర్ము ఈనెల 17న హకీంపేట విమానాశ్రయానికి చేరుకున్న నాటి నుంచి ఐదు రోజుల పాటు తిరిగి వెళ్ళేంత వరకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా అధికారులు సమన్వయం చేసుకొంటూ ఎంతో బాధ్యతాయుతంగా తమ విధులు నిర్వహించారని పర్యటన విజయవంతంలో వారి భాగస్వామ్యం ఎంతగానో ఉందని కలెక్టర్ అభినందించారు. రాష్ట్రపతి పర్యటన నేపథ్యంలో ఆయా శాఖల అధికారులకు అప్పగించిన బాధ్యతలను చిత్తశుద్ధితో ఎంతో కృషి చేశారని తెలిపారు.



అలాగే పోలీసు అధికారులు, సిబ్బంది , జిల్లా రెవెన్యూ శాఖ, సమాచార, రహదారులు, విద్యుత్తు, అటవీ శాఖ, జిల్లా వైద్య, ఆరోగ్య శాఖ, సివిల్ సప్లయి, అగ్నిమాపక శాఖతో పాటు అన్ని శాఖల అధికారులు కలిసికట్టుగా పని చేయడం వల్లే రాష్ట్రపతి పర్యటన విజయవంతంగా ముగిసిందని ఈ విషయంలో పర్యటన ప్రారంభం నుంచి మొదలుకొని ముగిసేంత వరకు తమ విధులను బాధ్యతాయుతంగా నిర్వహించిన అధికారులు, సిబ్బంది అందరికీ కలెక్టర్ గౌతమ్ అభినందనలు తెలిపారు..

## పుష్ప-2 సినిమాతో ఆఖరు... అవన్నీ ఆపేస్తున్నాం: మంత్రి కోమటిరెడ్డి

**హైదరాబాద్ పెన్ పవర్:**సంధ్య థియేటర్ తొక్కిసలాటలో తీవ్ర గాయాలతో ఆసుపత్రిపాలైన బాలుడు శ్రీతేజ్ ను తెలంగాణ మంత్రి కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి ఈ సాయంత్రం పరామర్శించారు. అనంతరం ఆయన ఆసుపత్రి వెలుపల మీడియాతో మాట్లాడారు. పుష్ప–2 ప్రీమియర్ షో చూసేందుకు రేవతి అనే మహిళ తన భర్త, కుమారుడితో శ్రీతేజ్ థియేటర్ వద్దకు వచ్చారని, అదే సమయంలో అల్లు అర్జున్ రావడంతో ఆయనను చూసేందుకు జనం ఎగబడ్డారని కోమటిరెడ్డి వెల్లడించారు. ఈ తొక్కిసలాటలో రేవతి, అమె కుమారుడు కిందపడిపోయారని... రేవతి మృతి చెందగా, శ్రీతేజ్ బాగా దెబ్బలు తగిలాయని వివరించారు. ఇంత జరిగినా హీరో గానీ, నిర్మాత గానీ ఏమీ పట్టించుకోకుండా వెళ్లి థియేటర్ బాల్కనీలో కూర్చుని సినిమా చూశారని కోమటిరెడ్డి ఆరోపించారు. థియేటర్ బయట పరిస్థితి ఏమీ బాగా లేదు సార్... మీరు వెళ్లిపోండి అని ఏసీపీ చెప్పినా వినిపించుకోకపోవడంతో, డీసీపీ వెళ్లి గట్టిగా మందలింపు ధోరణితో చెప్పాల్సి వచ్చిందని అన్నారు. అయినప్పటికీ, సినిమా అయిపోయే దాకా చూసి, మళ్లీ వాహనం రూఫ్ టాప్ నుంచి చెయ్యి ఊపుకుంటూ వెళ్లారని మంత్రి కోమటిరెడ్డి పేర్కొన్నారు.

"అక్కడ రేవతి, ఆమె బిడ్డ పరిస్థితి గురించి సినిమా వాళ్లు ఎవరూ పట్టించుకోలేదు. సినిమా చూడ్డానికి వచ్చిన వాళ్లు స్పందించడంతో, ఆమెను, ఆమె కొడుకును ఆసుపత్రికి తరలించారు. రేవతి చనిపోయింది. ఆమె కొడుకు చికిత్స పొందుతున్నాడు. ఇవాళ ఆ బిడ్డను చూసేందుకు ఆసుపత్రికి వచ్చాను. డాక్టర్లతోనూ, ఆసుపత్రి యాజమాన్యంతోనూ మాట్లాడాను. వెంటిలేటర్ తీసేసి, గొంతు వద్ద రంధ్రం చేసి శ్వాస అందిస్తున్నారు. పైపుల ద్వారా ఆహారం అందిస్తున్నారు... అబ్బాయి చాలా బలహీనంగా ఉన్నాడు. మృతి చెందిన రేవతికి ఆత్మశాంతి కలగాలని, ఆమె కుమారుడు త్వరగా కోలుకోవాలని భగవంతుడ్ని ప్రార్థిస్తున్నాను. ఆ రోజున పోలీసుల అనుమతి లేకుండానే చిత్రబృందం థియేటర్ వద్దకు వచ్చింది. హీరో కాన్వాయ్ తో పాటు అనేకమంది బౌన్సర్లు థియేటర్ వద్దకు వచ్చారు. ప్రేక్షకులను బౌన్సర్లు నెట్టివేశారు. ఇక మీదట సినిమాల ప్రీమియర్ షోలకు అనుమతిచ్చే విషయంపై సమీక్ష చేపడతాం. ఎంత బడ్జెట్ పెట్టి సినిమా తీసినా, టికెట్ల రేట్లు పెంచుకోవడంపై ఆచితూచి నిర్ణయం తీసుకుంటాం. దేశ స్వాతంత్ర్యానికి సంబంధించిందా? లేక, తెలంగాణ ఉద్యమానికి సంబంధించిందా? లేకపోతే, డ్రగ్స్ మీద, ఇతర సమస్యల మీద ప్రజలకు సందేశం ఇచ్చే సినిమానా? అనే విషయాలు ఆలోచించి, అది కూడా నామమాత్రంగానే టికెట్ రేట్లు పెంచుకునేందుకు అనుమతిస్తాం. బెనిఫిట్ షోలకు అనుమతించే ప్రశ్నే లేదు. ఇలాంటివన్నీ పుష్ప–2తోనే ఆపేస్తున్నాం. పుష్ప–2 చిత్రం బాగుంటే అందరూ చూడండి... నేను కూడా చూశాను.

ఇకపై దేవుళ్ల సినిమాలు, చరిత్రకు సంబంధించిన సినిమాలు, రాజుల సినిమాలు, తెలంగాణ ఉద్యమ సినిమాలు తప్ప ఇతర తెలుగు సినిమాలు చూడదలచుకోలేదు. ఎందుకంటే... మూడున్నర గంటలు ఉండే సినిమా చూసే బదులు చాలా పనులు చేసుకోవచ్చు. ఆ సినిమా చూసిన తర్వాత మన యువకులు కూడా చెడిపోతారు" అని మంత్రి కోమటిరెడ్డి వ్యాఖ్యానించారు.

## అసెంబ్లీలో సీఎం రేవంత్ అబద్ధాలు చెప్పారు

- మొదటి పేజి తరువాయి

ఎన్నికల ముందు చెప్పలేదని, ఇప్పుడు ఐటీ చెల్లించేవారికి రైతు భరోసా ఇవ్వమని చెప్పడమేంటని ప్రశ్నించారు. రుణమాఫీపై సీఎం మాటలకు, మంత్రులు, ఎమ్మెల్యేల మాటలకు పొంతన లేదని అన్నారు. రుణమాఫీపై చర్చకు సిద్ధమని సవాల్ విసిరారు. అంతకు ముందు సీఎం రేవంత్ రెడ్డి అసెంబ్లీచర్చల్లో భాగంగా బీఆర్ఎస్ పై తీవ్రస్థాయిలో విమర్శలు చేసిన విషయం తెలిసిందే. బీఆర్ఎస్ పదేళ్లలో సంపూర్ణంగా చేయలేని రుణమాఫీని తమ కాంగ్రెస్ ప్రభుత్వం ఒక్క ఏడాదిలోనే చేసిందని సీఎం రేవంత్ రెడ్డి అన్నారు. బీఆర్ఎస్ పదేళ్లలో కాలంలో కేవలం 27 వేల కోట్ల రుణమాఫీ చేస్తే.. తాము అధికారంలోకి వచ్చిన తర్వాత తక్కువ సమయంలో 20 వేల 616 కోట్లు రుణమాఫీ చేశామని సీఎం రేవంత్ రెడ్డి అన్నారు. రైతు భరోసాపై చర్చ సందర్భంగా మాట్లాడుతూ గత ప్రభుత్వం పదేళ్లలో కాళేశ్వరం కట్టి కూళేశ్వరంగా మార్చడం తప్ప ఏమీ చేయలేదని విమర్శించారు.

# ధార్మిక చైతన్యం బలోపేతానికి.. కేంద్ర మంత్రి బండి సంజయ్ భరోసా..

## ఆలయ వ్యవస్థ పునరుద్ధరణ,అనువంశిక అర్చకుల జీవన భద్రతకు సహకరిస్తా..






**హైదరాబాద్, పెన్ పవర్, డిసెంబర్ 21:** భారత సనాతన ధర్మం, సంస్కృతి పరిరక్షణ ప్రతి ఒక్కరి బాధ్యత అని కేంద్ర హోం శాఖ సహాయ మంత్రి బండి సంజయ్ అన్నారు.. కరీంనగర్‌లో ధార్మిక చాత్తాద శ్రీవైష్ణవ సమైక్య వైదిక పతాకాన్ని ఆవిష్కరించారు. సకల జనుల్లో ఆధ్మాత్మిక చైతన్యం కోసం కృషి చేస్తోన్న ధార్మిక చాత్తాద శ్రీవైష్ణవ సమైక్య వేదిక అధ్యక్షులు తోమాల కొండాస్వామిని అభినందించారు.. కేంద్రమంత్రి బండి సంజయ్. ఆలయ వ్యవస్థ పునరుద్దరణ, అనువంశిక అర్చకుల జీవన భద్రతకు సహకరిస్తానని భరోసానిచ్చారు..ఆలయాలు కేవలం ఆధ్యాత్మికతకు క్షేత్రాలు మాత్రమే కాదని, మన సాంస్కృతిక వారసత్వానికి మూలాధారాలని, అయితే, ఈ ఆలయాల సంరక్షణ, నిర్వహణ విషయంలో సదుపాయాలు సరిగా లేకపోవడం తో ధూపాదీప నైవేద్యాలు కొరవడడమే కాకుండా అర్చకుల జీవితాలు సైతం దైన్యంగా మారాయి.. ధార్మిక జీవనానికి పునాదులుగా నిలిచిన ఆలయాలు, వాటి సంరక్షణకు సంబంధించి పలు కీలక అంశాలపై తోమాల కొండస్వామి ఇచ్చిన విజ్ఞప్తులను కేంద్రమంత్రి బండి సంజయ్ పరిశీలించారు.. తెలంగాణలో అనువంశికంగా సేవలందిస్తున్న అర్చకులకు జీవన భద్రతలేదని, ఆదరించాల్సిన ఎండోమెంట్ అనువంశిక అర్చకుల ఆవేదనను ఏమాత్రం పట్టించుకోవడంలేదని తోమాల కొండస్వామి, మంత్రి దృష్టికి తీసుకెళ్లారు.. కేంద్రమంత్రి బండి సంజయ్‌తో భేటీ ముఖ్యాంశాలు:

**1..ఆలయాల అభివృద్ధి, పూర్వ వైభవం!**

నాడు భక్తి మార్గంలో సమాజాన్ని చైతన్య పరచిన ఆలయాలెన్నో తెలంగాణ వ్యాప్తంగా నేడు దూప దీప నైవేద్యాలకు నోచుకోవడంలేదు.. వాటికి పూర్వ వైభవం దిశగా చర్యలు చేపట్టాలి. అన్యాక్రాంతమైన ఆలయ భూములను తిరిగి స్వాధీనం చేసుకోవాలి.

**2. అర్చకుల సంక్షేమం:**

ప్రతి ఆలయంలో పనిచేస్తున్న అర్చకుల కుటుంబాలకు జీవనోపాధి అందించే విధంగా ప్రభుత్వం బడ్జెట్ కేటాయించి, తక్షణమే అమలు చేయాలి. ఏపీ తరహాలో ఆలయ వ్యవహారాల్లో అర్చకులకు సాధికారతను ఇవ్వాలి.

**3. వేద పాఠశాలలకు నిధుల కేటాయింపు:**

వేదపాఠశాలలు ధార్మిక జీవనానికి వెలుగు ప్రసరించే విద్యాలయాలు. ఎంపీ ఫండ్ ద్వారా వీటికి నిధులు కేటాయిస్తే, ఆధ్యాత్మిక విద్యావిధానం బలపడుతుంది,

**4. ఆలయ భూముల రక్షణ:**

ఆలయాలకు చెందిన భూములు అన్యాక్రాంతం కాకుండా, కఠినమైన చట్టాలు అమలు చేయాలని కోరారు. ఇప్పటికే కబ్జాలకు గురైన ఆలయ భూములను తిరిగి ఆలయ ఆధీనంలోకి తేవాలి.

**కేంద్రమంత్రి బండి సంజయ్ హామీ :**

తెలంగాణలోని ఆలయాల సంరక్షణ, అర్చకుల సంక్షేమం మనందరి ధార్మిక బాధ్యతన్నారు కేంద్రమంత్రి బండి సంజయ్ . ధార్మిక చాత్తాద శ్రీ వైష్ణవ సమైఖ్య వేదిక చేపడుతున్న కార్యక్రమాలను అభినందించడమే కాకుండా

పూర్తి సహకారం అందిస్తామని భరోసానిచ్చారు. వేద పాఠశాలల అభివృద్ధికి ఎంపీ ఫండ్ ద్వారా సహాయపడేందుకు ప్రయత్నిస్తానని హామీ ఇచ్చారు. సహృదయంతో సానుకూలంగా స్పందించిన కేంద్ర మంత్రి బండి సంజయ్‌కు ధన్యవాదాలు తెలిపారు తోమాల కొండస్వామి. శాలువాతో ఆత్మీయంగా, సగౌరవంగా సన్మానించారు.

# 25న మాదాపూర్‌లో.. బ్రాహ్మిన్ మెగా జాబ్ మేళా..!

## వెంకటేశ్వర ఫైనాన్స్ కాలేజీలో బ్రాహ్మణ నిరుద్యోగ యువతీ యువకుల కోసం హైర్ ద బెస్ట్ బ్రెయిన్స్..



గోగులపాటి కృష్ణమోహన్.. శ్రీ గాయత్రి బ్రాహ్మణ సేవా సంఘం అధ్యక్షుడు..




**హైదరాబాద్, పెన్ పవర్, డిసెంబర్ 21:** ఈనెల 25న హైదరాబాద్ మాదాపూర్ లోని శ్రీ వెంకటేశ్వర ఫైనాన్స్ కాలేజీలో బ్రాహ్మణ నిరుద్యోగ యువతీ యువకుల కోసం "హైర్ ద బెస్ట్ బ్రెయిన్స్" ఆధ్వర్యంలో ఏర్పాటు చేస్తున్న మెగా బ్రాహ్మణ్ జాబ్ మేళా కార్యక్రమంలో బ్రాహ్మణ నిరుద్యోగ యువతీ యువకులు అధిక సంఖ్యలో పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని శ్రీ గాయత్రి బ్రాహ్మణ సేవా సంఘం అధ్యక్షుడు గోగులపాటి కృష్ణమోహన్ విజ్ఞప్తి చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ "హైర్ ద బెస్ట్ బ్రెయిన్స్" ఫౌండర్ ఆలూరి టీం సభ్యులు మల్లాది చంద్రమౌళిల ఆధ్వర్యంలో గతంలో బ్రాహ్మణుల యువతీ యువకుల కోసం ఎన్నో జాబ్ మేళాలు నిర్వహించి విజయవంతం సాధించారని, వారి నిర్వహణలో మరో మెగా జాబ్ మేళాను మాదాపూర్‌లో నిర్వహిస్తున్నారని గోగులపాటి కృష్ణమోహన్ పేర్కొన్నారు.. ఇతర దేశాల నుండి కూడా కంపెనీలు ఈసారి పాల్గొని ఎంతోమందికి ఉద్యోగ అవకాశాలు అందించే అవకాశం ఉన్నందున నిరుద్యోగులైన బ్రాహ్మణ యువతీ యువకులు జాబ్ మేళాలో పాల్గొని తమ భవిష్యత్తుకు చక్కటి పునాదులు వేసుకోవాలని ఆయన సూచించారు.

ఉదయం 9 గంటల నుండి ప్రారంభమయ్యే ఈ కార్యక్రమంలో అల్పాహారంతో పాటు మధ్యాహ్నం భోజన సదుపాయం కూడా ఏర్పాటు చేయడం జరుగుతుందని ఆయన పేర్కొన్నారు. ఇంకా ఎన్‌రోల్ చేసుకోని వారు ఎవరైనా ఉంటే 9618300709 నెంబర్‌కి కేవలం వాట్సాప్ మెసేజ్ బ్రాహ్మిన్ జాబ్ సీకర్స్ అని మాత్రమే పెట్టాలని, దానికి వాట్సాప్ లో అప్లికేషన్ వివరాలు వస్తాయని తెలిపారు.. ఇప్పటికైనా ఆసక్తిగల బ్రాహ్మణ యువతీ యువకులు ఇట్టి అవకాశం సద్వినియోగం చేసుకోవాలని ఆయన తెలిపారు

## నా తండ్రి పేరు చెప్పుకుని ఇక్కడి వరకు రాలేదు

హైదరాబాద్ పెన్ పవర్:బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ పై ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నిప్పులు చెరిగారు. తండ్రి పేరు చెప్పుకుని తాను ఈ స్థాయికి రాలేదని చెప్పారు. ఒక్కొక్కడిని తొక్కుకుంటూ ఇక్కడి వరకు వచ్చానని అన్నారు. రైతులను ఆదుకోవడమే తమ ప్రభుత్వ లక్ష్యమని చెప్పారు. రైతుబంధు అమలులో గత ప్రభుత్వం నిర్లక్ష్యంగా వ్యవహరించిందని విమర్శించారు. శాసనసభలో మాట్లాడుతూ ఆయన ఈ వ్యాఖ్యలు చేశారు. రియల్ ఎస్టేట్ వ్యాపారులకు, పారిశ్రామికవేత్తలకు, సాగులో లేని భూమి రైతులకు కూడా రైతుబంధు ఇచ్చారని మండిపడ్డారు. రోడ్డు విస్తరణ పనుల్లో పోయిన భూములకు కూడా రైతుబంధు ఇచ్చారని దుయ్యబట్టారు. రాళ్లకు, రప్పలకు కూడా రైతుబంధు ఇద్దామా? అని ప్రశ్నించారు. పదేళ్ల బీఆర్ఎస్ పాలనతో రాష్ట్రం సర్వనాశనమయిందని రేవంత్ దుయ్యబట్టారు. బీఆర్ఎస్ ను ఆదర్శంగా తీసుకోవాలని అంటున్నారని... మళ్లీ రాళ్లకు, రప్పలకు రైతుబంధు ఇవ్వాలని అంటున్నారని ఎద్దేవా చేశారు. బీఆర్ఎస్ ను ఆదర్శంగా తీసుకుని ఉంటే తాము కూడా ప్రతిపక్షంలో ఉండేవాళ్లమని చెప్పారు. 2024లో డిపాజిట్లు కోల్పోయిన మీరు మాకు ఆదర్శం కాదని అన్నారు. శాసనసభలో బీఆర్ఎస్ నేతలు చిల్లరగా వ్యవహరించినా తాము ఓపికగా ఉన్నామని రేవంత్ చెప్పారు. అబద్ధాలకు అధ్యక్షుడు కేసీఆర్ సభకు రావడం లేదని, ఉపాధ్యక్షుడు కేటీఆర్ వస్తున్నారని అన్నారు. అర్ధరాత్రి ఓఆర్ఆర్ ను అమ్మి రెండో విడత రుణమాఫీ నిధులిచ్చారని విమర్శించారు. స్విస్ బ్యాంకుకు కూడా అప్పు ఇచ్చే స్థాయికి బీఆర్ఎస్ చేరుకుందని... ఆ పార్టీ తలుచుకుంటే రూ. 7 లక్షల కోట్ల రాష్ట్ర అప్పు కూడా తీర్చేస్తుందని రేవంత్ అన్నారు. రాష్ట్ర సంపద మొత్తం బీఆర్ఎస్ నేతల వద్దే ఉందని చెప్పారు. 16 మంది సీఎంలు చేసిన అప్పు రూ. 72 వేల కోట్లు అయితే... ఒక్క కేసీఆర్ మాత్రమే రూ. 6 లక్షల కోట్లకు పైగా అప్పులు చేశారని విమర్శించారు. రాష్ట్రాన్ని దోచుకున్న ఆర్థిక ఉగ్రవాదులను వదిలి పెట్టాలా? అని ప్రశ్నించారు.

## మంచు మనోజ్ కు కీలక ఆదేశాలు జారీ చేసిన హైదరాబాద్ సిటీ సివిల్ కోర్టు

హైదరాబాద్ పెన్ పవర్:మంచు ఫ్యామిలీ వివాదంలో మరో కీలక మలుపు చోటు చేసుకుంది. మంచు మనోజ్ కు హైదరాబాదులోని సిటీ సివిల్ కోర్టు మధ్యంతర నిషేధ ఉత్తర్వులను జారీ చేసింది. మంచు విష్ణు గురించి యూట్యూబ్ లేదా ఇతర సోషల్ మీడియా ప్లాట్ ఫామ్స్ లో ఎలాంటి వ్యాఖ్యలు చేయకూడదని... ఆయన పరువుకు నష్టం కలిగించే కామెంట్ చేయకూడదని కోర్టు ఆదేశించింది. కుటుంబ వివాదం నేపథ్యంలో మనోజ్ చేసిన వ్యాఖ్యలు విష్ణుకు బాధ కలిగించాయని ఆయన తరపు న్యాయవాదులు కోర్టులో వాదించారు. దీనికి సంబంధించిన సాక్ష్యాలను కూడా కోర్టుకు సమర్పించారు. ఈ క్రమంలో మంచు మనోజ్ సోషల్ మీడియాలో ఎలాంటి వ్యాఖ్యలు చేయకూడదని కోర్టు ఆదేశించింది. మరోవైపు మోహన్ బాబుకు తెలంగాణ హైకోర్టులో చుక్కెదురైంది. జర్నలిస్టుపై హత్యాయత్నం కేసులో తనను అరెస్ట్ చేయకుండా ఆదేశాలు ఇవ్వాలని కోరుతూ మోహన్ బాబు పిటిషన్ దాఖలు చేశారు. అయితే, మధ్యంతర ఉత్తర్వులు ఇచ్చేందుకు హైకోర్టు తిరస్కరించింది. హైదరాబాద్ లోనే ఉన్నారనే విషయాన్ని అఫిడవిట్ లో దాఖలు చేయాలని... అప్పుడు ఏదైనా తెలుస్తామని స్పష్టం చేసింది. తదుపరి విచారణను సోమవారానికి వాయిదా వేసింది.

# బీఆర్ఎస్ పదేళ్లలో చేయలేని రుణమాఫీ.. ఒక్క ఏడాదిలోనే చేసి చూపించాం: సీఎం రేవంత్ రెడ్డి



హైదరాబాద్ పెన్ పవర్:బీఆర్ఎస్ పదేళ్లలో సంపూర్ణంగా చేయలేని రుణమాఫీని తమ కాంగ్రెస్ ప్రభుత్వం ఒక్క ఏడాదిలోనే చేసిందని సీఎం రేవంత్ రెడ్డి అన్నారు. బీఆర్ఎస్ పదేళ్లలో కాలంలో కేవలం 27 వేల కోట్ల రుణమాఫీ చేస్తే.. తాము అధికారంలోకి వచ్చిన తర్వాత తక్కువ సమయంలో 20 వేల 616 కోట్లు రుణమాఫీ చేశామని సీఎం రేవంత్ రెడ్డి అన్నారు. రైతు భరోసాపై చర్చ సందర్భంగా మాట్లాడుతూ గత ప్రభుత్వం పదేళ్లలో కాళేశ్వరం కట్టి కూళేశ్వరంగా మార్చడం తప్ప ఏమీ చేయలేదని విమర్శించారు. గత ప్రభుత్వ హయాంలో సాగులో లేని భూములకు 21 వేల కోట్లు రుణమాఫీ చేశారని తెలిపారు. బీఆర్ఎస్ ప్రభుత్వం మొదటి ఐదేళ్లలో 16 వేల కోట్లు రుణమాఫీ చేశారని, లక్ష మిత్తి ఉంటతే 80 వేలు మిత్తీలకే సరిపోయిందని అన్నారు. రెండో సారి 11 వేల 909 కోట్లు రుణమాఫీ చేశారని తెలిపారు. ఐదేళ్లలో నికరంగా చేసిన రుణమాఫీ 3384 కోట్లు మాత్రమేనని అన్నారు. ఓఆర్ఆర్ అమ్మి రెండో విడత రుణమాఫీ డబ్బులు ఇచ్చారని తెలిపారు. పదేళ్లలో అధికారంలో ఉన్నపుడు బీఆర్ఎస్ చేసిన రుణమాఫీ 27 వేల కోట్లు చేస్తే.. తాము అధికారంలోకి వచ్చిన తర్వాత 27 రోజుల్లో 2 లక్షల రుణమాఫీ చేసిన ఘనత కాంగ్రెస్ పార్టీదని అన్నారు. కేవలం 27 రోజులలో 17 వేల కోట్లు మాఫీ చేసిన ఘనత కాంగ్రెస్ ప్రభుత్వానిదని గుర్తు చేశారు. ఏడాదిలోనే అధికారంలోకి వచ్చిన తర్వాత మొత్తం 20 వేల 616 కోట్లు రుణమాఫీ చేశామని తెలిపారు.

# ఈ లక్షణాలు కనిపిస్తే... మీరు షుగర్ అతిగా తీసుకుంటున్నట్టే!



హైదరాబాద్ పెన్ పవర్:ఇటీవలి కాలంలో ఇంటి ఆహారం కంటే బయటి ఫుడ్ తినడం పెరిగిపోయింది. అందులోనూ బేకరీ ఐటమ్స్, ఫాస్ట్ ఫుడ్, జంక్ ఫుడ్ తరచూ తీసుకోవడం ఎక్కువైంది. పైగా కూల్ డ్రింక్స్, పళ్ల రసాలు కూడా. వీటితో మనకు తెలియకుండానే మన శరీరంలోకి చేరే చక్కెర స్థాయిలు పెరిగిపోతున్నాయి. తీపిగా అనిపించకపోయినా... చాలా వరకు ప్రాసెస్డ్ ఫుడ్ లో అధిక స్థాయిలో చక్కెరలు ఉంటాయని నిపుణులు స్పష్టం చేస్తున్నారు. దానికి మనం అలవాటు పడిపోతున్నామని... అలా అధిక చక్కెర శరీరంలోకి వెళుతోందనే దానికి కొన్ని లక్షణాలు సూచికలని చెబుతున్నారు.

**ఏదో ఒక తీపి పదార్థం తినాలనిపించడం...**

ఐస్ క్రీమ్ లు, కూల్ డ్రింకులు, కొన్ని రకాల ప్రాసెస్డ్ ఫుడ్, పళ్ల రసాలు వంటివి ఏదో ఒక తీపి పదార్థాన్ని తరచూ తీసుకోవాలని ఉబలాటంగా ఉండటం... అప్పటికే మన శరీరం అధిక చక్కెరలకు అలవాటు పడిందనే దానికి సూచిక అని నిపుణులు హెచ్చరిస్తున్నారు. అధిక చక్కెరలకు అలవాటు పడిన శరీరం... తరచూ తీపి పదార్థాలు తినాలనిపించే భావనను పెంచుతుందని సూచిస్తున్నారు.

**చర్మంపై కురుపులు, మొటిమలు**

శరీరంలోకి అధికంగా చక్కెర చేరుతూ ఉంటే... రక్తంలో షుగర్ స్థాయిలు తీవ్రంగా హెచ్చుతగ్గులకు లోనవుతూ ఇన్ ఫ్లమేషన్ కు కారణమవుతాయని నిపుణులు చెబుతున్నారు. దీనివల్ల చర్మంపై కురుపులు, మొటిమలు, మచ్చలు వంటివి తరచూ ఏర్పడుతాయని... చర్మం ఇన్ ఫెక్షన్లకు త్వరగా లోనవుతుందని వివరిస్తున్నారు. అంతేకాదు... చర్మం ముడతలు పడటం వంటి వృద్ధాప్య లక్షణాలు త్వరగా వస్తాయని హెచ్చరిస్తున్నారు.

**ఉన్నట్టుండి నీరసం, అలసట రావడం...**

చక్కెరలు అధికంగా ఉన్న పదార్థాలను తీసుకున్నప్పుడు అప్పటికప్పుడు రక్తంలో షుగర్ స్థాయిలు పెరుగుతాయి. కాసేపటికే అంతే వేగంగా పడిపోతూ ఉంటాయి. దీనివల్ల శరీరంలో సమతుల్యత కొరవడి... ఉన్నట్టుండి నీరసం, అలసట వంటి లక్షణాలు కనిపిస్తాయని నిపుణులు చెబుతున్నారు.

**తరచూ ఇన్ఫెక్షన్లు, జబ్బులు రావడం...**

శరీరంలో షుగర్ స్థాయిలు వేగంగా హెచ్చుతగ్గులకు లోనవుతూ ఉంటే... రోగ నిరోధక వ్యవస్థపై ప్రభావం పడుతుంది. దీనితో తరచూ ఇన్ఫెక్షన్లు, జబ్బులు ఇబ్బందిపెడతాయి. అంతేకాదు... అవి తగ్గడానికి కూడా ఎక్కువ సమయం తీసుకుంటూ ఉంటాయి.

**బరువు పెరిగిపోతుండటం...**

చక్కెరలు అధికంగా తీసుకున్నప్పుడు రక్తంలో షుగర్ స్థాయిలు వేగంగా పెరుగుతాయి. వాటిని నియంత్రించేందుకు మన శరీరం ఆ షుగర్ ను కొవ్వుగా మార్చి నిల్వ చేసుకుంటూ ఉంటుంది. దీనితో శరీరంలో కొవ్వు పేరుకుపోతూ బరువు పెరిగిపోతుంటారు.

**ఈ అంశాలను గుర్తుంచుకోండి**

చక్కెర పరిమితికి మించి ఏ రూపంలో తీసుకున్నా శరీరానికి ప్రమాదమేనని నిపుణులు స్పష్టం చేస్తున్నారు. అయితే పైన చెప్పిన లక్షణాలు కనిపిస్తేనే చక్కెర అధికంగా వినియోగిస్తున్నట్టు కాదని... ఎలాంటి లక్షణాలు లేకుండా కూడా శరీరంలో అధిక చక్కెర చేరుతూ ఉండవచ్చని వివరిస్తున్నారు. అంతేగాకుండా ఇతర ఆరోగ్య సమస్యలతోనూ పైన చెప్పిన లక్షణాలు రావొచ్చని... అందువల్ల తగిన వైద్య పరీక్షలు చేయించుకోవాలని సూచిస్తున్నారు.

# ఈ పూలను ఇలా వాడితే... నల్లని, నిగనిగలాడే కురులు మీ సొంతం!



**హైదరాబాద్ పెన్ పవర్:**తీవ్ర ఒత్తిళ్లు, కాలుష్యం, సరైన పోషకాహారం లేకపోవడం వంటి కారణాలతో ఇటీవల చాలా మంది జుత్తు రాలిపోయే సమస్య ఎదుర్కొంటున్నారు. అంతేకాదు వెంట్రుకలు తెల్లబడటం, గరుకుగా మరి మధ్యలోకి తెగిపోవడం వంటి సమస్యలు మరెన్నో. అయితే కొన్ని రకాల పూలు ఈ సమస్యలను తగ్గించడానికి అద్భుతంగా పనిచేస్తాయని... పైగా వెంట్రుకలు నల్లగా, నిగనిగలాడేలా చేస్తాయని ఆయుర్వేద నిపుణులు చెబుతున్నారు. వాటిని ఎలా వాడితే ప్రయోజనం ఉంటుందో వివరిస్తున్నారు. వారు చెబుతున్న వివరాల ప్రకారం...

**మందార పూలు**

మందార పూలలో కొన్ని రకాల అమైనో ఆమ్లాలు, యాంటీ ఆక్సిడెంట్లు ఎక్కువ. అవి వెంట్రుకలు రాలిపోకుండా కాపాడుతాయని నిపుణులు చెబుతున్నారు. కొన్ని మందార పూల రేకులు, ఒక టేబుల్ స్పూన్ కొబ్బరి నూనె, ఒక టేబుల్ స్పూన్ పెరుగు తీసుకుని... వాటిని బాగా కలిపి వెంట్రుకల కుదుళ్లకు పట్టించాలని సూచిస్తున్నారు. అరగంట తర్వాత గోరు వెచ్చని నీటితో కడిగేయాలని... ఇలా తరచూ చేస్తే వెంట్రుకలు నల్లగా, నిగనిగలాడుతూ పెరుగుతాయని చెబుతున్నారు.తామర పుష్పాలు పొడిబారిపోయి, దెబ్బతిన్న వెంట్రుకలు తిరిగి నిగనిగలాడేలా చేసే సామర్థ్యం తామర పుష్పాల సొంతం. తామర పూల రేకుల నుంచి ఆయిల్ ను తీసి, లేదా రసం తీసి... కొంచెం కొబ్బరి నూనెలో కలిపి వెంట్రుకలు, కుదుళ్లకు మర్దన చేయాలి. అరగంట తర్వాత కడిగేయాలని నిపుణులు సూచిస్తున్నారు.

**గులాబీ పూలు**

ఈ పూలలో యాంటీ సెప్టిక్ లక్షణాలు ఉంటాయి. ఇవి దెబ్బతిన్న వెంట్రుకల కుదుళ్లను పునరుద్ధరించడానికి తోడ్పడతాయి. గులాబీ రేకులను నీటిలో వేసి మరిగించి... ఆ నీటిని నిల్వ చేసుకోవాలి. తల స్నానం చేసిన తర్వాత వెంట్రుకలు, కుదుళ్లకు ఆ నీటిని పట్టిస్తే వెంట్రుకలు నిగనిగలాడతాయని నిపుణులు చెబుతున్నారు.

**బంతి పూలు**

బంతి పూలలో యాంటీ ఇన్ ఫ్లమేటరీ లక్షణాలు ఉంటాయని, అవి వెంట్రుకల కుదుళ్లలో ఇన్ ఫ్లమేషన్ ను తగ్గించి పునరుద్ధరిస్తాయని నిపుణులు చెబుతున్నారు. కొబ్బరినూనెలో కొన్ని బంతిపూల రేకులను వేసి నానబెట్టుకోవాలని... వెంట్రుకలు, కుదుళ్లకు ఈ నూనెతో మర్దన చేసుకుంటే మంచి ఫలితం ఉంటుందని వివరిస్తున్నారు.

**మల్లె పూలు**

వెంట్రుకలు పొడిబారి, తెగిపోకుండా మల్లె పూలు రక్షిస్తాయని ఆయుర్వేద నిపుణులు వివరిస్తున్నారు.
ఇవి వెంట్రుకల కుదుళ్లకు పోషణను ఇచ్చి, బలోపేతం చేస్తాయని చెబుతున్నారు. జాస్మిన్ ఆయిల్ ను, కొంత విటమిన్-ఈ ఆయిల్ తో కలిపి వెంట్రుకలు, కుదుళ్లకు పట్టేలా మర్దన చేయాలని సూచిస్తున్నారు. అరగంట తర్వాత చల్లటి నీటితో కడిగేయాలని వివరిస్తున్నారు.

**ఇవి గుర్తుంచుకోండి...**

ఈ పూల వినియోగం, తీరు ఆయుర్వేద నిపుణులు చెప్పిన వివరాల ప్రకారం పేర్కొన్నవే. వ్యక్తులను బట్టి, వినియోగం తీరును బట్టి ఫలితాలు వేర్వేరుగా ఉండవచ్చు. అందువల్ల దగ్గరిలోని ఆయుర్వేద నిపుణులను సంప్రదించి వినియోగించడం మంచిదని నిపుణులు చెబుతున్నారు.

# భార్యపై కసితో... రూ.80 వేల చిల్లర నాణేలతో కోర్టుకు వచ్చిన వ్యక్తి




**హైదరాబాద్ పెన్ పవర్:**భార్య మీద ఎంతో కోపం ఉంటే తప్ప ఓ భర్త ఇలాంటి పనికి పూనుకోడు! తమిళనాడులో ఆసక్తికర సంఘటన చోటుచేసుకుంది. ఓ విడాకుల కేసును విచారించిన కోర్టు... భార్యకు భరణం కింద రూ.80 వేలు చెల్లించాలని భర్తను ఆదేశించింది. దాంతో ఆ భర్త అన్నీ రూ.2, రూ.1 నాణేలు తీసుకుని కోర్టుకు వచ్చాడు. సంచులకొద్దీ నాణేలు తీసుకువచ్చిన ఆ వ్యక్తిని చూసి న్యాయమూర్తి విస్తుపోయాడు.

ఈ ఘటన వివరాల్లోకి వెళితే... తమిళనాడులోని కోయంబత్తూరులో 37 ఏళ్ల ఓ వ్యక్తి ట్యాక్సీ డ్రైవర్ గా పనిచేస్తున్నాడు. 2023లో అతని భార్య ఫ్యామిలీ కోర్టులో విడాకులకు దరఖాస్తు చేసుకుంది. ఈ కేసుపై విచారణ చేపట్టిన కోయంబత్తూరు అదనపు ఫ్యామిలీ కోర్టు... భార్యకు రూ.2 లక్షల మధ్యంతర భరణం చెల్లించాలని ఆ ట్యాక్సీ డ్రైవర్ ను ఆదేశించింది. ఆ డబ్బును కోర్టులో చెల్లించాలని న్యాయమూర్తి తన ఉత్తర్వుల్లో పేర్కొన్నారు. అయితే, ఆ వ్యక్తి ఇలాంటి సమయంలో కూడా భార్యపై కోపాన్ని వీడలేదు. ఆమెను ఇబ్బంది పెట్టాలనే ఉద్దేశంతో కోర్టుకు నాణేలతో వచ్చాడు. 20 సంచుల్లో నాణేలతో వచ్చిన ఆ వ్యక్తిని చూసిన న్యాయమూర్తి ఆగ్రహం వ్యక్తం చేశారు. నాణేలు కాదు... వెళ్లి నోట్లు తీసుకురా అని తిప్పి పంపారు. దాంతో, ఆ వ్యక్తి నాణేల సంచులన్నీ కార్లో పెట్టుకుని వెళ్లిపోయాడు. దీనికి సంబంధించిన వీడియో సామాజిక మాధ్యమాల్లో వైరల్ అవుతోంది.

## సంధ్య థియేటర్ తొక్కిసలాట.. మెరుగుపడ్డ చిన్నారి శ్రీతేజ ఆరోగ్యం

**తొక్కిసలాట ఘటనలో రేవతి అనే మహిళ మృతి**

**కిమ్స్ ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న ఆమె కుమారుడు**

**శ్రీతేజ కళ్లు తెరుస్తున్నాడని తెలిపిన వైద్యులు**



**హైదరాబాద్ పెన్ పవర్:**'పుష్ప-2' ప్రీమియర్ షో సందర్భంగా హైదరాబాద్ లోని ఆర్టీసీ క్రాస్ రోడ్స్ లోని సంధ్య థియేటర్ వద్ద జరిగిన తొక్కిసలాటలో రేవతి అనే మహిళ ప్రాణాలు కోల్పోయిన సంగతి తెలిసిందే. ఇదే ఘటనలో తీవ్రంగా గాయపడ్డ ఆమె కుమారుడు శ్రీతేజ్ హైదరాబాద్ లోని కిమ్స్ ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నాడు. శ్రీతేజ్ ఆరోగ్య పరిస్థితి ప్రస్తుతం కొంత మెరుగుపడిందని వైద్యులు తెలిపారు. చికిత్సకు స్పందిస్తున్న శ్రీతేజ కళ్లు తెరుస్తున్నాడట. చికిత్సకు స్పందిస్తున్నాడట. ట్యూబ్ ద్వారా చిన్నారికి ఆహారం అందిస్తున్నట్టు వైద్యులు తెలిపారు. కోలుకోవడానికి ఇంకొంత సమయం పడుతుందని చెప్పారు.

## కువైట్ కు బయల్దేరిన ప్రధాని మోదీ

**43 ఏళ్ల తర్వాత తొలిసారి కువైట్ లో పర్యటిస్తున్న భారత ప్రధాని**

**1981లో కువైట్ లో పర్యటించిన ఇందిరాగాంధీ**

**కువైట్ రాజుతో పలు అంశాలపై చర్చలు జరపనున్న మోదీ**




**హైదరాబాద్ పెన్ పవర్:** భారత ప్రధాని నరేంద్ర మోదీ కువైట్ కు బయల్దేరారు. కువైట్ లో ఆయన రెండు రోజుల పాటు పర్యటించనున్నారు. భారత ప్రధాని కువైట్ లో పర్యటించనుండటం 43 ఏళ్ల తర్వాత ఇదే తొలిసారి. దీంతో, మోదీ పర్యటనకు ప్రాధాన్యత నెలకొంది. 1981లో అప్పటి ప్రధాని ఇందిరాగాంధీ కువైట్ లో పర్యటించారు. 2009లో నాటి ఉప రాష్ట్రపతి హమీద్ అన్సారీ ఆ దేశంలో పర్యటించారు.
కువైట్ పర్యటనలో ఆ దేశ రాజు అమీర్ షేక్ మెషల్ అల్ అహ్మద్ అల్ జబ్బర్ అల్ సభాతో మోదీ సమావేశమవుతారు. ఈ సందర్భంగా ఇరు దేశాల మధ్య బంధం మరింత బలోపేతమయ్యే దిశగా ఇరువురు చర్చలు జరపనున్నారు. వాణిజ్యం, పెట్టుబడులు, ఇంధన సహకారం, సంస్కృతి తదితర అంశాలపై ప్రధానంగా చర్చించనున్నారు. కువైట్ లో నివసిస్తున్న భారతీయులతో కూడా మోదీ సమావేశం కానున్నారు. వారిని ఉద్దేశించి ప్రసంగించనున్నారు.

## చర్లపల్లి రైల్వే స్టేషన్ ని సందర్శించిన మల్కాజ్ గిరి ఎంపీ ఈటల రాజేందర్

**హైదరాబాద్ పెన్ పవర్:**ఎంపి ఈటల రాజేందర్ శనివారం నాడు చర్లపల్లి రైల్వే స్టేషన్ ను పరిశీలించారు. కేంద్ర ప్రభుత్వం 430 కోట్ల రూపాయల వ్యయంతో ప్రతిష్టంత్మకంగా నిర్మించిన చర్లపల్లి రైల్వే స్టేషన్ ను ఈనెల 28న కేంద్ర రైల్వే శాఖ మంత్రి అశ్విని వైష్ణవ్, కిషన్ రెడ్డిలు ప్రారంబిస్తున్నట్లు ఆయన తెలిపారు. ఈ ప్రారంభోత్సవనికి చుట్టుప్రక్కల ప్రజలు జన సమీకరణగా ఏర్పడి పెద్ద ఎత్తున పాల్గొనాలని అన్నారు.ఆధునిక హంగులతో రూపుదిద్దుకున్న రైల్వేస్టేషన్ వల్ల హైదరాబాద్ సికింద్రాబాద్, కాచిగూడ నాంపల్లి నగర వాసులకు జనవత్తిడి లేకుండా ఉంటుందని తెలిపారు. సికింద్రాబాద్ రైల్వే స్టేషన్ లో ఒత్తిడిని తగ్గించేందుకు చుట్టుపక్కల ప్రాంతాల ప్రజలకు అందుబాటులో ఉండే విధంగా విశాల ప్రదేశంలో ఏర్పాటు చేసారని అన్నారు.రాష్ట్ర ప్రభుత్వం సహకరించకపోయినప్పటికీ కేంద్రం ముందుకు వచ్చి రైల్వే స్టేషన్ కు రోడ్డు సౌకర్యం కల్పించి వేగవంతంగా పనులు పూర్తి చేసిందని తెలిపారు.

## సీసీ రోడ్లను డ్రైనేజీ కాలువలు పరిశీంచిన ఎంపీడీవో



**హైదరాబాద్ పెన్ పవర్:**సకాలంలో పనులు పూర్తి చేయాలని ఎంపీడీవో సుబ్బరాజు అధికారులను సూచించారు. శనివారం కౌతాళం గ్రామ పంచాయతీ నందు " పల్లె పండుగ " కార్యక్రమంలో భాగంగా మహాత్మా గాంధీ జాతీయ గ్రామిణ ఉపాధి హామీ పథకం కింద నిర్మిస్తున్న " చురుగ్గా సాగుతున్న సిసి రోడ్లు మరియు డ్రైనేజీ కాలువలు. శివప్ప కాలనీలో మంగలి రవికుమార్ నుండి నమల వీరప్ప వరకు మరమతులను " అంచనా మొత్తం ఖీబ 15.00 లక్షలు తో నిర్మిస్తున్న పనులను పరిశీలించిన ఎంపీడీవో సుబ్బరాజు హాజరైన మండల ఇంజనీరింగ్ అధికారి శ్రీనివాసరెడ్డి , అదనపు కార్యక్రమ అధికారి మాధవ శంకర్ హాజరైన ఇంజనీరింగ్ అసిస్టెంట్ వెంకట జ్యోతిర్మయి, టెండరు పుల్లం రాజు మరియు తదితరులు పాల్గొనరు.

## శాసన సభలో సీఎం ప్రసంగంపై బీఆర్ఎస్ అభ్యంతరం, నిరసన

**హైదరాబాద్ పెన్ పవర్:**

రైతు భరోసా పై స్వల్పకాలిక చర్చలో భాగంగా సీఎం రేవంత్ రెడ్డి సభను తప్పుదోవ పట్టిస్తున్నాడు అంటూ బీఆర్ఎస్ ఎమ్మెల్యేలు అభ్యంతరం వ్యక్తం చేసారు. ఇచ్చిన ఆరు గ్యారెంటీ లు అమలు చేయలేకపోతున్నాం అంటూ సీఎం చెప్పకనే సభలో చెప్పారు. రాష్ట్ర ఆర్థిక పరిస్థితి దృష్ట్యా రైతు భరోసా, వ్యవసాయ కూలీలకు, కౌలు రైతులకు మేము ఇద్దాం అనుకున్న డబ్బులు లేవు అనడం పరోక్షంగా హామీలు అమలు చేయలేము అని చెప్పినట్లే నని అన్నారు.

## యూపీలో పెళ్లి చేసుకున్న ఇద్దరు యువతులు.. ఆసక్తికర విషయం ఏంటంటే..!



**హైదరాబాద్ పెన్ పవర్:**ఉత్తరప్రదేశ్‌లోని కన్నౌజ్‌లో ఇద్దరు యువతులు వివాహం చేసుకున్నారు. రాణు, జ్యోతి అనే ఇద్దరు యువతులు ఇలా తాజాగా కన్నౌజ్‌లోని సదర్ కొత్వాలిలో వారి కుటుంబాల అనుమతితో వివాహబంధంలోకి అడుగుపెట్టారు. అయితే, వారిలో ఒకరు సామాజిక అడ్డంకులను అధిగమించేందుకు లింగమార్పిడి ఆపరేషన్ చేయించుకున్నారు. దీనికోసం వారు సుమారు రూ. 7 లక్షలు ఖర్చు చేశారు.వివరాల్లోకి వెళితే.. కన్నౌజ్‌లోని సదర్ కొత్వాలిలో ఇంద్ర గుప్తా అనే వ్యక్తి నగల దుకాణం నడుపుతున్నాడు. అతని కుమార్తె శివాంగి. అయితే, ఒకరోజు ఆ నగల దుకాణానికి జ్యోతి అనే యువతి వచ్చింది. ఆ సమయంలో వారిద్దరి మధ్య మాటలు కలిశాయి. ఆ తర్వాత ఇద్దరూ తరచూ మాట్లాడుకోవడం చేశారు. ఈ క్రమంలో బ్యూటీ పార్లర్ తెరవడానికి జ్యోతి ఆమెను అద్దెకు ఒక షాప్ అడిగింది. దాంతో శివాంగి ఆమెకు తమ దుకాణం ఉన్న భవనంలోనే ఓ గదిని అద్దెకు ఇచ్చింది. ఆ తర్వాత వారి పరిచయం ప్రేమగా మారడం, చివరికి ఇద్దరు వివాహం చేసుకోవాలని నిర్ణయించుకున్నారు.

అయితే, స్వలింగ వివాహం వల్ల సామాజిక అవమానం తప్పదనుకున్నారు. దాంతో కీలక నిర్ణయం తీసుకున్నారు. శివాంగికి లింగమార్పిడి ఆపరేషన్ చేయించాలని నిర్ణయించుకున్నారు. ఆ తర్వాత ఆమె లక్నో, ఢిల్లీలోని వైద్యులను సంప్రదించి లింగమార్పిడి ఆపరేషన్లు చేయించుకుంది. అనంతరం ఆమె తన పేరును శివంగి నుంచి రాణుగా మార్చుకుంది. అటు వారి ప్రేమను ఇరువురి కుటుంబాలు కూడా అంగీకరించాయి. దాంతో ఈ జంట వారి కుటుంబాల ఆశీర్వాదంతో నవంబర్ 25న పెళ్లి చేసుకున్నారు.

## నేరాల నియంత్రణకు గ్రామాల్లో పట్టణాల్లో ముమ్మరంగా పెట్రోలింగ్ బీట్స్

### ఎస్పి అఖిల్ మహాజన్



**రాజన్న సిరిసిల్ల పెన్ పవర్::** జిల్లా ఎస్పీ అఖిల్ మహాజన్ శనివారం జిల్లాలోని పోలీస్ అధికారులతో నేర సమిక్ష సమావేశం నిర్వహించారు. ఎస్పీ మాట్లాడుతూ. నేరాల నియంత్రణకు గ్రామాల్లో,పట్టణాల్లో ముమ్మరంగా పెట్రోలింగ్ నిర్వహించాలని, జిల్లాలో నేరాలు జరుగుతున్న తీరు, ఎక్కువగా నేరాలు జరుగుతున్న ప్రాంతాలు గుర్తించి ఆయా ప్రాంతాల్లో ప్రతి రోజు సాయంత్రం సమయంలో బీట్స్ గస్తీ, ఏర్పాటు చేసి ప్రజలకు ఎల్లపుడు అందుబాటులో ఉండి ముందస్తు నేరా నియంత్రణకు పటిష్టమైన చర్యలు చేపట్టాలనీ సూచించారు.

అండర్ ఇన్వెస్టిగేషన్లో ఉన్న కేసులను త్వరగా డిస్పోజల్ చేయాలన్నారు. పోక్సో, ఎస్సీ, ఎస్టీ గ్రేవ్ కేసుల్లో త్వరితగతిన ఇన్వెస్టిగేషన్ పూర్తి చేసి కోర్టులో ఛార్జ్ షీట్ దాఖలు చేయాలని, ప్రతి కేసులో క్వాలిటీ ఇన్వెస్టిగేషన్ ఉండడంతో పాటు పూర్తి పారదర్శకంగా కేసును ఇన్వెస్టిగేషన్ చేయాలన్నారు.

దొంగతనాలపై అధికారులు, సిబ్బంది ప్రత్యేక దృష్టి సారించి నిఘాను పటిష్టం చేయాలని, దొంగతనం కేసులల్లో ప్రతి రోజు కేసుల చెదనలో భాగంగా అన్ని కోణాల్లో ప్లాన్ ఆఫ్ యాక్షన్, ఎస్ఓపి ప్రకారం ఇన్వెస్టిగేషన్ చేసి కేసులు చేధించాలని, ప్రజలతో సత్సంబంధాలు ఏర్పరుచుకోని ఇన్ఫర్మేషన్ వ్యవస్థ పటిష్టం చేయాలని, శాంతి భద్రతల పరిరక్షణలో ప్రజల్ని భాగస్వామ్యం చేయాలని అధికారులకు సూచించారు.

జిల్లాలోని ప్రతి పోలీస్ స్టేషన్ల పరిధిలో గంజాయి, పేకాట, పిడిఎస్ రైస్, గుడుంబ,ఇతర చట్ట వ్యతిరేకమైన నేరాలు, అసాంఘిక కార్యకలాపాల పై ప్రత్యేక నిఘా ఏర్పాటు చేసి కేసులు నమోదు చేయాలని, ఇతర చట్టవ్యతిరేకమైన కార్యకలాపాలకు పాల్పడే వారిపై కఠినంగా వ్యవహరించాలని అధికారులకు ఆదేశించారు.

రోడ్డు ప్రమాదాలు జరగకుండా పోలీస్ స్టేషన్ల పరిధిలో ప్రతి రోజు డ్రంక్ అండ్ డ్రైవ్ లు నిర్వహించాలని,ఓవర్ స్పీడ్, ట్రిపుల్ డ్రైవింగ్, మైనర్లు వాహనాలు నడుపుట లాంటి వాటిపై ప్రత్యేక దృష్టి పెట్టి స్పెషల్ డ్రైవ్ లు నిర్వహించాలని అన్నారు.

విధి నిర్వహణలో ఉత్తమా ప్రతిభ కనబర్చిన అధికారులకు, సిబ్బందిని అందినదించి ప్రశంశ ప్రోత్సాహకాలు అందించారు.

ఈ సమావేశంలో ఏఎస్పీ శేషాద్రిని రెడ్డి, డిఎస్పీ చంద్రశేఖర్ రెడ్డి, సిఐ లు కృష్ణ, మొగిలి, శ్రీనివాస్, వీరప్రసాద్, శ్రీనివాస్, వెంకటేశ్వర్లు, ఎస్.ఐ లు, ఐటీ కోర్ సిబ్బంది పాల్గొన్నారు.

## మాజీ సీఎం జగన్మోహన్ రెడ్డి జన్మదిన వేడుకలు...

**హైదరాబాద్ పెన్ పవర్:**కొలిమిగుండ్ల మండల కేంద్రంలోని స్థానిక వైఎస్ఆర్ పార్టీ కార్యాల యంలో మాజీ సీఎం జగన్మోహన్ రెడ్డి 53వ జన్మదిన వేడుకలను జడ్పీ చైర్మన్ ఎర్రబోతుల పాపిరెడ్డి, ఎర్రబోతుల ఉదయ భాస్కర్ రెడ్డి ఆధ్వర్యంలో వైసీపీ నాయకులు కార్యకర్తలు కలిసి కేక్ కట్ చేసి సంబరాలు జరుపుకున్నారు. గత వైసీపీ ప్రభుత్వంలో అన్ని వర్గాల ప్రజలకు ప్రభుత్వ సంక్షేమ పథకాలను అందించామని కూటమి ప్రభుత్వంలో ఇప్పటివరకు సూపర్ సిక్స్ అన్నారు. ఇంతవరకు పింఛన్ తప్ప ఏ పథకాలు ప్రజలకు అమలు చేయడం లేదని వారు కూటమి ప్రభుత్వాన్ని విమర్శించారు. ఈ కార్యక్రమంలో వైసీపీ మండల కన్వీనర్ అంబటి గురువిరెడ్డి, లాయర్ మహేశ్వర్ రెడ్డి, పేరం సత్యనారాయణ రెడ్డి, మొలక రాజారెడ్డి, కోటపాడు ఈశ్వర్ రెడ్డి, ఎర్రగుడి వెంకటేశ్వర రెడ్డి, సర్పంచ్ కంబగిరి స్వామి, బాచము మహేశ్వర్ రెడ్డి, పేరం రామ శంకర్ రెడ్డి, నాగేశ్వర్ రెడ్డి, కంబయ్య, చంద్రశేఖర్ రెడ్డి, వెంకట్ రామ్ రెడ్డి, సోమశేఖర్ రెడ్డి, నందిపాడు సర్పంచ్ గురెడ్డీ, ఈశ్వరయ్య, కృష్ణారెడ్డి, కలవటాల తిమ్మారెడ్డి, గోపాల్ రెడ్డి, ఇంకా తదితర నాయకులు కార్యకర్తలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# డయల్ 100 కాల్స్ పై ఆలసత్వం వద్దు



**హైదరాబాద్ పెన్ పవర్:**పోలీస్ కమిషనర్ డా. బి. అనురాధ పోలీస్ అధికారులతో కమిషనర్ కార్యాలయంలో పెండింగ్ ఉన్న కేసులపై సమీక్ష సమావేశం నిర్వహించి 2023, 2024 అండర్ ఇన్వెస్టిగేషన్ కేసులలో గ్రేవ్ నాన్ గ్రేవ్ కేసుల గురించి ఎసిపి, సిఐలను అడిగి తెలుసుకున్నారు.

ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ. 2023 సంవత్సరంలో పెండింగ్ ఉన్న కేసులలో అన్ని కోణాలుల్లో పరిశోధన చేసి కేసులు ఫైనల్ చేయాలని సూచించారు.

గర్ల్స్, ఉమెన్ మిస్సింగ్ కేసులలో దరఖాస్తు రాగానే వెంటనే కేసు నమోదు చేసి పరిశోధన ప్రారంభించి, వెంటనే ట్రేస్ ఔట్ చేయాలని సూచించారు. మిస్సింగ్ కేసులలో ఎలాంటి అలసత్వం వహించవద్దు. సిఈ ఐఆర్ లో ట్రేస్ అవుట్ అయినా మొబైల్ ఫోన్లను వెంటనే రికవరీ చేసి సంబంధిత బాధితులకు అప్పగించాలని సూచించారు.

యంఓ అఫెండర్స్, సస్పెక్ట్లు, కేడీలు, డిసీలు, రౌడీలు, పై నిఘా ఉంచి వారి యొక్క కదలికలను ఎప్పటికప్పుడు గమనిస్తూ ఉండాలని సూచించారు. డయల్ 100 కాల్ రావాలి వెంటనే రెస్పాండ్ అయి స్వార్థమైనంత త్వరగా సంఘటన స్థలానికి వెళ్లి సమస్యలు పరిష్కరించాలని సూచించారు. డయల్ 100 కాల్స్ పై అలసత్వం వహించవద్దని అన్నారు.

నాన్ బేలబుల్ వారెంట్ ఎన్ బి డబ్ల్యూ ఎస్, సాధ్యమైనంత త్వరగా ఎగ్జిక్యూట్ చేయాలని సూచించారు. రోడ్డు ప్రమాదాల గురించి రోడ్ సేఫ్టీ కమిటీ, సంబంధిత డిపార్ట్మెంట్ అధికారులతో రోడ్డు ప్రమాదాలు జరిగే ప్రదేశాలను సందర్శించి నివారణ చర్యలు తీసుకోవాలని సూచించారు.సీసీటీఎన్ఎస్ లో ఎఫ్ఐఆర్, సిడిఎఫ్, పార్ట్ వన్, పార్ట్ టూ, రిమాండ్ డైరీ, చార్జిషీట్ సీసీ నెంబర్ డాటా ను ఏరోజు కారోజు ఎంట్రీ చేయాలి. పెండింగ్ ఉన్న దరఖాస్తులను విచారణ చేసి త్వరగా డిస్పోజల్ చేయాలని సూచించారు. పోలీస్ స్టేషన్ లో కేసులలో ఉన్న క్రైమ్ వెహికల్ కోర్టులో కేసు డిస్పోజల్ కాగానే వెంటనే సంబంధిత యజమానికి అందజేయాలని సూచించారు. వాహనాలు అప్పగించడంలో ఎలాంటి నిర్లక్ష్యం చేయకూడదని తెలిపారు. ప్రతిరోజు ఉదయం సాయంత్రం విజబుల్ పోలీస్ సింగ్ విధులు నిర్వహించాలి, పోలీస్ అధికారులు సిబ్బంది గ్రామాలను సందర్శించినప్పుడు కమ్యూనిటీ పోలీసు ఇందులో భాగంగా అవేర్నెస్ ప్రోగ్రామ్స్ ఏర్పాటు చేసి ప్రజలకు అవగాహన కల్పించాలని సూచించారు. డ్రగ్ ఇతర మత్తు పదార్థాలు, సైబర్ నేరాలు, అభయ యాప్, సామాజిక రుక్మతల గురించి కాలేజీలలో స్కూల్లలో విద్యార్థినీ విద్యార్థులకు అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలని సూచించారు. గంజాయి, ఇతర మత్తు పదార్థాలు పేకాట, జూదం, తదితర వాటిపై ప్రత్యేక నిఘా ఏర్పాటు చేసి ఉక్కు పాదంతో అణిచివేయాలి. మహిళల రక్షణకు పెద్దపీట వేయాలి.

ప్రతి అధికారి నిజాయితీగా విధులు నిర్వహించాలి. విధి నిర్వహణలో అలసత్వం వహించవద్దు, విధి నిర్వహణలో అలసత్వం వహించే వారిపై శాఖపరమైన చర్యలు తప్పవని హెచ్చరించారు. ఈ సమావేశంలో సిద్దిపేట ఏసిపి మధు, గజ్వేల్ ఎసిపి పురుషోత్తం రెడ్డి, హుస్నాబాద్ ఏసీపి సతీష్, ఎస్బి ఇన్స్పెక్టర్ కిరణ్, సిసిఆర్బి ఇన్స్పెక్టర్ రామకృష్ణ, ఇన్స్పెక్టర్ కమలాకర్, వన్ టౌన్ ఇన్స్పెక్టర్ వాసుదేవరావు, టూ టౌన్ ఇన్స్పెక్టర్ ఉపేందర్, త్రీ టౌన్ ఇన్స్పెక్టర్ విద్యాసాగర్, రూరల్ సీఐ శ్రీను, దుబ్బాక సీఐ శ్రీనివాస్, తొగుట సీఐ లతీఫ్, గజ్వేల్ ఇన్స్పెక్టర్ సైదా, గజ్వేల్ రూరల్ సీఐ మహేందర్ రెడ్డి, మరియు పోలీస్ అధికారులు తదితరులు పాల్గొన్నారు.

# కేంద్ర హోంశాఖ శాఖ మంత్రి అమిత్ షా బర్తరఫ్ చేయాలి

## ప్రజా సంఘాల ఐక్య వేదిక



**హైదరాబాద్ పెన్ పవర్:**శనివారం మండల కేంద్రంలో ప్రజా సంఘాల ఐక్య వేదిక ఆధ్వరంలో ఆతీ . బి.ఆర్. అంబేద్కర్ సర్కిల్ నందు రాస్తరోకో నిర్వయించడం జరిగింది. ఈ కార్యక్రమాన్ని ఉద్దేశించి సిపిఎం పార్టీ మండల సీనియర్ నాయకులు మల్లయ్య మరియు జై భీం వ్యవస్థాపక అధ్యక్షుడు అవతారం మాట్లాడుతూ మొన్న రాజ్యసభ లో కేంద్ర హోంశాఖ మంత్రి అమిత్ షా అంబేద్కర్ అవమానపరచిన వ్యాఖ్యలను తీవ్రంగా ఖండిస్తున్నామని మరియు ఈ రోజు ఈ దేశం లో ఉన్న ప్రతి పౌరుడు స్వచ్ఛగా బ్రతుకుతున్నడంటే దానికి కారణం ఆతీ . బి.ఆర్. అంబేద్కర్ గారే కారణం. అటువంటి మహనీయుని గురించి ఒక రౌడీ షిటర్ మరియు ఆర్థిక నేరగాడు అయినటువంటి అమిత్ షా మాట్లాడుతుంటే దయ్యాలు వేదాలు చెప్పినట్లు వుంది అని అన్నారు. అదే విధంగా యువగళం పాదయాత్ర లో నారాలోకేష్ కి అప్పటి రాష్ట్ర ప్రభుత్వం ఆటంకం కలిగిస్తే భారత రాజ్యాంగం పట్టుకొని పాదయాత్ర చేసాడని అప్పుడు లోకేష్ మరియు పవన్ కళ్యాణ్ కు ఈ రాష్ట్రాలు రక్షణ కల్పించింది కూడా అంబేద్కర్ రాసిన రాజ్యాంగమే అని వారు తెలిపారు.ఇప్పటికైనా ఎన్డీఏ ప్రభుత్వం అమిత్ షా వెంటనే కేంద్రమంత్రి పదవి నుండి తొలగించి తమ చిత్తశుద్ధిని నిరూపించుకోవాలని మరియు దేశ ప్రజలకు క్షమాపణ చెప్పాలని వారు డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమములో దళిత సమైక్య నాయకులు , ప్రకాష్ , తిమోతి అఖఎ (ఓఒ ) నాయకులు జగదీష్ , సర్పంచ్ పాల్ దినకర్ , ఆవాజ్ కమిటీ నాయకులు ఖాజా , ఇద్రుష్ , వీరేష్ ,రవి, సుధాకర్, విజయ్ జనసేన మండల నాయకులు రామాంజినేయులు మరియు పెద్ద ఎత్తున దళిత బిడ్డలు పాల్గొన్నారు.

## సౌమ్య చిల్డ్రన్స్ హాస్పిటల్ లో 500 గ్రాముల ఆడశిశువుకు పునర్జన్మ

**హైదరాబాద్ పెన్ పవర్:** నెలలు నిండకుండానే కేవలం అర కిలో బరువుతో జన్మించిన శిశువుకు వైద్యులు పునర్జన్మనిచ్చారు. ఐడీపీఎల్ కు చెందిన 26 వారాల గర్భిణి ఒకరు నొప్పులతో జులై 30న హైదరాబాద్ ఎస్సార్ నగర్ లోని సౌమ్య ఆసుపత్రిలో చేరారు. నెలలు నిండకుండానే కేవలం అర కిలో బరువుతో జన్మించిన శిశువుకు వైద్యులు వైద్యం అందించారు.

ఇంత తక్కువ బరువుతో శిశువు జన్మించడం అరుదని నియోనాటాలజిస్ట్ డా. కె. రవిశంకర్ తెలిపారు. శిశువును మూడు నెలలపాటు ఎన్ఐసీయూలో ఉంచామని, కోలుకున్నాక మరో నెలన్నరపాటు సాధారణ గదిలో ఉంచి చికిత్స చేశామన్నారు. రెస్పిరేటరీ డిస్ట్రెస్ సింద్రోమ్, సెప్సిస్, బ్రోంకోపుల్మోనరీ డైస్ప్లాసియా, నెక్రోటైజింగ్ ఎంట్రోకోలైటిస్ మరియు దూకుడు రెటినోపతి ఆఫ్ ప్రీమెచ్యూరిటీ వంటి అనేక సమస్యలను ఎదుర్కొన్నప్పటికీ, బృందం శిశువు యొక్క నాడీ సమగ్రతను మరియు సరైన ఆరోగ్యాన్ని నిర్ధారించింది. ప్రస్తుతం శిశువు బరువు 1.950 కిలోలకు చేరడంతో తల్లీబిడ్డలను డిశ్చార్జి చేశామన్నారు. ఆమెకు ఇది రెండో కాన్పు. తొలి ప్రసవంలో కవల కుమారులు జన్మించారు.

## సంతోష్ నగర్ లోని డాక్టర్ డయాగ్నస్టిక్ సెంటర్ లో వైద్య అధికారులు తనిఖీలు

**హైదరాబాద్ పెన్ పవర్:**సంతోష్ నగర్ లోని డాక్టర్ డయాగ్నస్టిక్ సెంటర్ లో స్కానింగ్ నమోదులో అవకతవకలు జరిగినట్లు గుర్తించి యంత్రాలను సీజ్ చేశామని డీఎంహెచ్ఓ వెంకట్ తెలిపారు. సెంటర్ లో పేషంట్ల స్కానింగ్ వివరాలు జిల్లా వైద్య శాఖకు రిపోర్ట్ చేయడం లేదని చెప్పారు. ఎక్కువ మంది పేషంట్లు వచ్చినా ఆన్ లైన్ రికార్డుల్లో తక్కువగా ఉన్నట్లు చూపించారని అన్నారు. అంతేగాకుండా డయాగ్నస్టిక్ సెంటర్ లలో వైద్య సిబ్బంది వివరాల బోర్డ్ ఉంచాలని సూచించారు. డయాగ్నస్టిక్ సెంటర్లలో అక్రమాలు జరిగితే టోల్ ఫ్రీ నెంబర్ కు పిర్యాదు చేయవచ్చని కోరారు.

## నాగార్జున సాగర్ ఎడమ కాలువల ప్రాజెక్టు కమిటి చైర్మన్ గా కోట వీరబాబు ఎకగ్రీవ ఎన్నిక....

**హైదరాబాద్ పెన్ పవర్:**నాగార్జున సాగర్ ఎడమ కాలువ ప్రాజెక్ట్ కమిటి అధ్యక్ష కార్యదర్శుల ఎన్నిక శనివారం విజయవాడ లోని జలవనరుల శాఖ రైతు శిక్షణ కేంద్రం లో జరిగింది....ఉమ్మడి కృష్ణా జిల్లా పరిధిలోని 17 మంది డిస్ట్రీభ్యూటరీ కమిటి చైర్మన్ లు ప్రాజెక్ట కమిటి చైర్మన్ గా కోట వీరబాబు, వైస్ చైర్మన్ గా అళ్ళ వెంకట గోపాలకృష్ణ ను ఎకగ్రీవం గా ఎన్నుకున్నారు...ఇరిగేషన్ శాఖ యస్ ఇ ఆర్ శ్రీరామకృష్ణ ఎన్నికల అధికారిగా వ్యవహరించారు. అధ్యక్ష ఉపాధ్యక్షుల ఎన్నిక ఎకగ్రీవం కావడం తో జిల్లాలోని నేతలు వారికి అభినందనలు తెలిపారు.ఎన్టీఆర్ జిల్లా అధ్యక్షుడు నెట్టెం రఘురాం మైలవరం, పామర్రు, నందిగామ ఎమ్మెల్యేలు వసంత కృష్ణ ప్రసాదు, వర్ల కుమార్ రాజా తంగిరాల సౌమ్య తో పాటు జిల్లాకు చెందిన నేతలు కోట వీరబాబు కు అభినందనలు తెలిపారు. శాలువాలు కప్పి బోకేలతో సత్కరించారు.

ఆనంతరం ప్రాజెక్టు కమిటి చైర్మన్ కోట వీరబాబు మాట్లాడుతూ నాగార్జున సాగర్ ప్రాజెక్ట్ జోన్-2,3 పరిధిలోని అయకట్టు రైతులకు సాగునీటిని అందించడం కోసం డిసి చైర్మన్ ల సహకారంతో పనిచేస్తానని తెలిపారు

## పంచాయతీ ఎన్నికల నిబంధనలు యధాతథం..!!

**హైదరాబాద్ పెన్ పవర్:**ఇద్దరు పిల్లలకు మించి ఉన్నవారు స్థానిక సంస్థల ఎన్నికల్లో పోటీకి అనర్హులనే నిబంధన తెలంగాణలో కొనసాగనుంది. ఈ నిబంధనను మార్చాలని వచ్చిన ప్రతిపాదనలను రాష్ట్ర మంత్రి మండలి తిరస్కరించింది.

పాత నిబంధననే కొనసాగించాలని పంచాయతీ రాజ్ ను ఆదేశించింది. దీంతో శాసనసభలో ప్రవేశపెట్టిన బిల్లులో దీనికి సవరణ చేయలేదు. ఇతర అంశాలతో పంచాయతీరాజ్ చట్ట సవరణ బిల్లును ప్రవేశపెట్టగా.. సభ ఆమోదం తెలిపింది. కుటుంబ నియంత్రణ చర్యల్లో భాగంగా 1994లో ఉమ్మడి రాష్ట్రంలో ఇద్దరి కంటే ఎక్కువ సంతానం ఉన్న వ్యక్తులు పురపాలక, పంచాయతీరాజ్ సంస్థల ఎన్నికల్లో పోటీకి అనర్హులని చట్టం చేశారు. ప్రస్తుతం కుటుంబ నియంత్రణ పై అవగాహన పెరిగినందు కు పాత నిబంధనను మార్చి ఇద్దరి కంటే ఎక్కువ సంతానం ఉన్న వారికి సైతం పోటీ చేసే అవకాశం ఇవ్వాలని పలు రాజకీయ పార్టీలు, ప్రజా ప్రతినిధులు కోరుతున్నారు.

దీనికి కొందరు మంత్రులు హామీ ఇచ్చారు. ఈ మేరకు పంచాయతీ రాజ్ శాఖ. చట్టసవరణ ప్రతిపాదనల్లో ఈ అంశాన్ని చేర్చి మంత్రిమండలి ఆమోదానికి పెట్టింది. దీనికి మంత్రిమండలి అనుమతించలేదు. తెలంగాణలో సంతానోత్పత్తి రేటు పై శాస్త్రీయ ఆధారాలు లేకపోవడం, నిబంధన మార్పును కొన్ని వర్గాలు వ్యతిరేకిస్తాయనే కారణంతో ఈ ప్రతిపాదనను నిరాకరించినట్లు తెలుస్తోంది. ఈ ఒక్కటి మినహా మిగిలిన అన్ని ప్రతిపాదనలను మంత్రిమండలి ఆమోదించింది. దీనికి అనుగుణంగా చట్టసవరణ బిల్లును రూపొందించి పంచాయతీరాజ్ శాఖ బిల్లును ప్రవేశపెట్టింది. మొన్నటి వరకు ఆశావహులుగా ఉన్న వ్యక్తులకు ఈ ప్రకటనతో నిరాశే మిగిలినట్లయింది. గ్రామీణ స్థాయిలో పోటీ చేసే వారికి కనీస విద్యా అర్హతలైనా పాటిస్తే చట్టాల అమలు పై అవగాహన ఉండేదని కొందరు అభిప్రాయం వ్యక్తం చేస్తున్నారు. మొన్నటి వరకు ఆశావహులుగా ఉన్న వ్యక్తుల్లో నిరాశే మిగిలింది. స్థానిక సంస్థ ఎన్నికల్లో పోటీ చేసే అభ్యర్థులకు కనీస విద్యార్హత ప్రకటిస్తే చట్టాల పట్ల విధుల పట్ల కనీస అవగాహన ఉంటుందని కొందరి అభిప్రాయం.

## చెరువులో మునిగి తల్లి, కొడుకు, కూతురు మృతి

**హైదరాబాద్ పెన్ పవర్:** మహబూబ్ నగర్ జిల్లా నవాబుపేట మండలంలో విషాదం నెలకొంది. ప్రమాదవశాత్తు చెరువులో మునిగి తల్లి ఇద్దరు పిల్లలు మృతి చెందారు. నవాబ్ పేట మండలం పోమాల గ్రామంలో చెందిన సరోజ అనే మహిళ తన కొడుకు ఇద్దరు కూతుళ్ళతో కలిసి చెరువులో బట్టలు వుతకడానికి వెళ్ళగా పిల్లలు చెరువులో ఆడుకుంటున్న సమయంలో మునిగిపోతున్నట్టుగా గమనించిన తల్లి కాపాడే ప్రయత్నంలో తల్లి, కొడుకు, కూతురు నీళ్లలో మునిగి చనిపోయారు. పెద్ద కూతురు ప్రాణాలతో బయటపడినట్లు స్థానికులు తెలిపారు.

## తెలంగాణ రాష్ట్రంలోనే ప్రథమంగా మరకత కార్యసిద్ధి పంచముఖి ఆంజనేయ స్వామికి దేదీప్యమాన పూజలు,

**హైదరాబాద్ పెన్ పవర్:**రంగారెడ్డి జిల్లా శంకర్ పల్లి మండలం సింగాపురం గ్రామంలో అ పంచముఖ ఆంజనేయస్వామి విగ్రహ ప్రతిష్టాపన జరిగి నేటికీ 41 రోజు ఆయిన సందర్భాన్ని పురస్కరించుకొని సింగాపురం గ్రామంలో ప్రత్యేక పూజలు పంచామృత అభిషేకాలు సుగంధ పరిమళాల అభిషేకాలతో పాటు అన్నదానాలు పారాయణాలు జరిప్తమానంగా ఉదయం నుంచి సాయంత్రం వరకు కొనసాగాయి బహుశా తెలంగాణ రాష్ట్రంలోనే పంచముఖ మరకత ఆంజనేయస్వామి విగ్రహం అనేది రంగారెడ్డి డిస్ట్రిక్ట్ శంకర్ పల్లి మండలము సింగపూర్ గ్రామంలోనే ఉండడం విశేషం.ఈ అందమైన ఆంజనేయస్వామి విగ్రహాన్ని చూసేందుకు భక్తులు తరలివస్తున్నారు.అనారోగ్యాలు ఉన్నవాళ్లు ఏదన్న ఆటంకాలు ఉన్నవాళ్లు పనులు కాని వాళ్ళు ఈ మరకత పంచముఖ ఆంజనేయస్వామి దర్శనం చేసుకొని ప్రసాదం స్వీకరిస్తే శుభాలు జరుగుతాయి

# రైతు భరోసాపై సీఎం హామీ

**హైదరాబాద్ పెన్ పవర్:**తెలంగాణలో రైతు భరోసా అమలుపై ఎన్నో అనుమానాలు ఉన్నాయి. ముఖ్యంగా కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చాక.. ఈ పథకాన్ని నిలిపేస్తారని ప్రచారం జరిగింది. తాజాగా దీనిపై బీఆర్ఎస్.. కాంగ్రెస్ పార్టీని టార్గెట్ చేసింది. ఈ నేపథ్యంలో అసెంబ్లీలో సీఎం రేవంత్ కీలక ప్రకటన చేశారు.రైతు భరోసాను కాంగ్రెస్ ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా భావించిందని.. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి స్పష్టం చేశారు. రైతు భరోసా అంశంపై శాసనసభలో మాట్లాడిన రేవంత్ రెడ్డి.. ప్రధాన ప్రతిపక్షం సలహాలు తీసుకుని విధివిధానాలను ముందుకు తీసుకెళ్లాలని భావిస్తున్నట్టు వెల్లడించారు. రైతు భరోసా.. రైతులను ఆదుకునేందుకేనని.. రైతుభరోసా అమలు విషయంలో ఎలాంటి అనుమానాలు అక్కర్లేదని తేల్చి చెప్పారు.రైతులను ఆదుకోవడంలో మా ప్రభుత్వం ముందుంటుంది. భూమినే నమ్ముకుని, భూమిని అమ్మగా భావించిన రైతులను ఆదుకోవాలనేదే మా ఆలోచన. రైతు బంధు ఉద్దేశం పెట్టుబడి సాయం. పెట్టుబడి సాయం ఎవరికి ఉండాలి? గత ప్రభుత్వం పదేళ్లలో రూ.72,817 కోట్లు రైతు బంధు రూపంలో ఖర్చు చేసింది. సాగులో లేని భూములకు, గుట్టలు, లే-అవుట్లకు, నేషనల్ హైవేస్‌కు కూడా రైతు బంధు ఇచ్చారు. రూ.72,817 కోట్లలో దాదాపు రూ.22వేల కోట్లు అనర్హులకు ఆయాచిత లబ్ది చేకూర్చారు' అని సీఎం వివరించారు.



### రాళ్లకు.. గుట్టలకు ఇద్దామా..

'ఇప్పుడు కూడా రాళ్లకు, గుట్టలకు, రహదారులకు మనం రైతు భరోసా ఇద్దామా? గతంలో గజ్వేల్ నియోజకవర్గ పరిధిలోని రాజీవ్ రహదారి కూడా రైతు బంధు ఇచ్చారు. ఆమన్ గల్ ప్రాంతంలో శ్రీశైలం రోడ్లకు కూడా ఇచ్చారు. క్రషర్ యూనిట్లకు, మైనింగ్ భూములకు కూడా రైతు బంధు ఇచ్చారు. వాళ్ల అనుయాయులు కొందరు నకిలీ పట్టాల ద్వారా కూడా రైతు బంధు పొందారు. హైదరాబాద్ చుట్టుపక్కల 50కి.మీ పరిధిలో 70 నుంచి 80 శాతం వ్యవసాయం చేయడం లేదు. కానీ గతంలో హైదరాబాద్ చుట్టుపక్కల 3 కోట్ల ఎకరాలకు డబ్బులు ఇచ్చుకుంటూ వెళ్లారు' అని రేవంత్ రెడ్డి వివరించారు.'రైతు బంధు రూపంలో వేలాది కోట్ల కొల్లగొట్టారు. 80 వేల పుస్తకాలు చదివిన మేధస్సుతో రైతు భరోసాపై ప్రధాన ప్రతిపక్ష నాయకుడు సూచనలు ఇస్తారని మేం భావించాం. చివరి పేద వాడికి కూడా ప్రభుత్వ పథకాల ఫలాలు అందజేయాలనేదే మా ప్రభుత్వ లక్ష్యం. వాళ్లు ఇచ్చారు కాబట్టి మమ్మల్ని అందరికీ ఇవ్వాలంటున్నారు. వాళ్ళను ఆదర్శంగా తీసుకోమంటున్నారు. వాళ్ళను ఆదర్శంగా తీసుకుంటే వాళ్లలాగే మేం ఇక్కడ ఉండం' అని ముఖ్యమంత్రి వ్యాఖ్యానించారు.

### రైతులే ఆదర్శం..

'మాకు రైతులు ఆదర్శం.. రైతు సంక్షేమమే మాకు ముఖ్యం. సభలోకి వస్తే సమాజం ముందు తల దించుకోవాల్సి వస్తుందనే ఆలోచనతో ప్రధాన ప్రతిపక్ష నాయకుడు సభకు రాలేదేమో. రాళ్లు రప్పలు, గుట్టలు, రియల్ లే అవుట్లకు, నేషనల్ హైవేలకు రైతు భరోసా ఇద్దామా? ప్రతిపక్షంగా ఒక స్పష్టమైన సూచన ఇవ్వండి. మీ సూచనలు సహేతుకమైతే మేం వినడానికి సిద్ధంగా ఉన్నాం' అని రేవంత్ స్పష్టం చేశారు.'2019లో నేను పార్లమెంటులో రైతు ఆత్మహత్యలపై అడిగిన ప్రశ్నకు సభలో సమాధానం ఇచ్చారు. 2014, 2015, 2016 కు సంబంధించి రైతు ఆత్మహత్యలపై సభలో సమాధానం ఇచ్చారు. ఏపీలో 2014లో 160, 2015లో 516, 2016లో 239 మంది రైతులు ఆత్మహత్య చేసుకున్నారు. మహారాష్ట్రలో దేశంలోనే అత్యధికంగా 2014లో 2568, 2015లో 3030, 2016లో 2550 రైతులు ఆత్మహత్య చేసుకున్నారు. వాళ్ల ఏలుబడిలో తెలంగాణ రైతు ఆత్మహత్యల్లో రెండో స్థానంలో ఉంది. తెలంగాణలో 2014లో 898, 2015లో 1358, 2016లో 632 రైతులు ఆత్మహత్యలు చేసుకున్నారు' అని రేవంత్ రెడ్డి వ్యాఖ్యానించారు.

### సిగ్గుచేటు..

'మనకంటే అత్యధిక జనాభా ఉన్న రాష్ట్రాల్లో కూడా ఇన్ని ఆత్మహత్యలు జరగలేదు. ధనిక రాష్ట్రం, మిగులు రాష్ట్రంలో ఇన్ని ఆత్మహత్యలు జరగడం సిగ్గుచేటు. వాళ్లు తల దించుకుని రైతులకు క్షమాపణలు చెప్పాల్సింది పోయి.. గొప్పలు చెప్పుకుంటున్నారు. రైతులకు వాస్తవాలు తెలుసు కాబట్టే వాళ్లకు కర్రు కాల్చి వాత పెట్టారు. ఏడాదిలో మేం ఏం చేశామని ఇన్నిసార్లు అడుగుతున్నారు.. పదేళ్లలో మీ హయాంలో ఏం జరిగిందో వెనక్కి తిరిగి చూసుకోండి. ఐదేళ్లలో లక్ష రూపాయల రుణమాఫీకి వాళ్లు ఖర్చు చేసింది రూ.16,143 కోట్లు. అది కేవలం మిత్తికే సరిపోయింది. రెండోసారి అధికారంలోకి వచ్చాక వీళ్లు చేసిన రుణమాఫీ రూ.11, 909 కోట్ల 31 లక్షలు మాత్రమే' అని ముఖ్యమంత్రి వివరించారు.'మీరు చేసిన రుణమాఫీ కేవలం రూ.3384 కోట్లు మాత్రమే... ఇదీ మీ చరిత్ర. పదేళ్లలో వారు చేసిన రుణమాఫీ రూ.27వేల కోట్లు. 27 రోజుల్లో దేశంలో ఎక్కడా లేని విదంగా మొదటి ఏడాదిలోనే 25,35,963 రైతులకు రూ.20,616 కోట్లు రుణమాఫీ చేసి మా ప్రభుత్వం రైతుల రుణం తీర్చుకుంది. ఇది మా గొప్పతనంగా మేం అనుకోవడంలేదు. ఇది మా బాధ్యతగా భావిస్తున్నాం. మాట తప్పని, మడమ తిప్పని పార్టీ కాంగ్రెస్. తెలంగాణ రాష్ట్రం ఇచ్చిన గొప్ప నాయకురాలు సోనియా గాంధీ. సోనియా దగ్గరికి వెళ్లి బొక్కబోర్ల పడిన సంగతి మరిచిపోయారు. కృతజ్ఞత లేని మనుషులు వాళ్లు' అని రేవంత్ రెడ్డి విమర్శించారు.

# మాదాపూర్ లో అగ్ని ప్రమాదం

**హైదరాబాద్ పెన్ పవర్:**

హైదరాబాద్‌లో భారీ అగ్నిప్రమాదం జరిగింది. మాదాపూర్ లోని ఓ బార్ అండ్ రెస్టారెంట్‌లో ఈ ఘటన జరిగింది. శనివారం ఉదయం ఆరు గంటలకు మాదాపూర్ ప్రాంతంలో సత్వ కంపెనీ భవనంలోని నాలుగు, ఐదవ అంతస్తుల్లో ఒక్కసారిగా మంటలు చెలరేగాయి.పొగ మెల్ల మెల్లగా బయటకు రావడంతో ఏం జరిగిందో తెలీక అందులోవున్న సిబ్బంది భయంతో బయటకు పరుగులు పెట్టారు. వెంటనే ఫైర్ ఇంజన్లకు సమాచారం అందించారు. రంగంలోకి దిగిన అగ్నిమాపక యంత్రాలు మంటలను ఆర్పే పనిలో నిగమ్నమయ్యారు.గంటన్నర తర్వాత మంటలు అదుపులోకి వచ్చాయి. ఈ ఘటనలో ఎలాంటి ప్రాణనష్టం గానీ, ఎవరు గాయపడ లేదని అగ్నిమాపక అధికారి తెలిపారు. ప్రమాదం జరిగిన సమీపంలో టెక్కీ కంపెనీ ఉండడంతో ఉద్యోగులను అధికారులను అక్కడి నుంచి తరలించారు. ఈ ఘటనపై దర్యాప్తు కొనసాగుతోంది.